కక్షిదారులు రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్టే..

- వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి
- లోక్ అదాలత్‌లో 2,009 కేసుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 14 : రాజీయే రాజ మార్గమని.. కక్షిదారులు రాజీ పడితే ఇద్దరూ గెలిచినట్టేనని వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సున్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిష్కారం కాని కేసులతో ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో జాప్యం జరుగుతున్నదని.. దానిని నివారించేందుకే లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో నైతిక విలువలు తగ్గిపోవడంతోనే అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. జిల్లాలోని కోర్టుల్లో కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య తగాదాలు, రహదారి ప్రమాదాలు, ఆస్తి, భూమి, ఇతర తగాదాలకు సంబంధించి 2,009 కేసులను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శీతల్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రత్యేక ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అశోక్, జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శ్రుతిదూత, ఎస్సీ నారాయణ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్నం నరేందర్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటికి వస్తారు..

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సతీమణి శృతిరెడ్డిని శనివారం వికారాబాద్ జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ మాజీ జడ్పీటీ సీలు పరామర్శించారు. నరేందర్‌రెడ్డి లగచర్ల ఘటనలో అరెస్టై గత నెల రోజులుగా రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో.. ప్రమోదిని, సుజాత, అరుణాదేశ్యానాయక్, నాగరాణి, హరిప్రియ, కోట్ల మహిపాల్ ముదిరాజ్, నర్మద, శకుంతల, అనురాధ, శోభ, చాంద్‌పాషా తదితరులు హైదరాబాద్‌లోని వారి నివాసంలో శృతిరెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. నరేందర్‌రెడ్డి త్వరలోనే కడిగిన ముత్యంలా నిర్దోషిగా బయటికి వస్తారన్నారు. -దౌల్తాబాద్/వికారాబాద్, డిసెంబర్ 14

పరిగిని ఫిఫ్త్‌సిటీగా తీర్చిదిద్దుతా

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబర్ 14 : సీఎం రేవంత్‌రెడ్డి ముచ్చర్లలో ఫోర్త్‌సిటీని నిర్మిస్తానని ప్రకటించారని, తాను పరిగిని ఫిఫ్త్‌సిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. పరిగి మున్సిపాలిటీని విస్తరించడంతోపాటు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తానన్నారు. శనివారం సాయంత్రం పరిగిలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిగి పట్టణం చుట్టూ ఔటర్‌రింగ్ రోడ్డును నిర్మిస్తామని.. డీజిల్ వాహనాలన్నీ పట్టణ శివారు నుంచే వెళ్తాయని తద్వారా పొల్యూషన్ అతి తక్కువగా ఉన్న ప్రాంతంగా పరిగి నిలుస్తుందన్నారు. రూ.3,100 కోట్లతో చేపడుతున్న నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని, రూ. 3,600 కోట్లతో రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి రీ-సర్వే జరుగుతున్నదన్నారు. పాంబండ రామలింగేశ్వరాలయాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని.. రెండు గుట్టలకు రోప్‌వేతోపాటు అతిథి గృహం నిర్మాణానికి నిధుల మంజూరుకు ప్రతిపాదిస్తామన్నారు. రాకంచర్ల నర్సింహస్వామి ఆలయ నిర్మాణం, పరిగిలోని వేణుగోపాలస్వామి ఆలయ పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. పరిగి-షాద్‌నగర్, పరిగి-వికారాబాద్ వయా నస్కల్ రోడ్లను ఫోర్ ట్రాక్‌గా చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించామని వివరించారు. లక్నాపూర్ ప్రాజెక్టును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చి దిద్దడంతోపాటు బోటింగ్‌ను ఏర్పాటు చేస్తామని.. తుంకులగడ్డలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ క్యాంపస్‌ను నిర్మించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలన్నీ ఒకే దగ్గర ఉండేలా చూస్తామన్నారు. నేడు (ఆదివారం) జరిగే పాంబండ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కులకచర్ల, పరిగి మార్కెట్ కమిటీల పాలకవర్గాల ప్రమాణ స్వీకారోత్సవాలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరు కావడంతోపాటు పలు అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపనలు చేస్తారని ఎమ్మెల్యే చెప్పారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

- రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్
- వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభం
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చిత్రంలో పక్కన కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 14 : విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో ఒకే విధమైన డైట్ ప్లాన్‌ను ప్రవేశపెట్టగా.. జిల్లాల్లోని వివిధ వసతి గృహాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారని తెలిపారు. సర్కారు డైట్ చార్జీలను 40%, కాస్మెటిక్ చార్జీలను 200% పెంచిందన్నారు. అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు వీలుగా ప్రభుత్వం కామన్ డైట్ ప్లాన్‌ను అమలు చేస్తున్నదని.. తద్వారా పిల్లలకు పోషకాలతో కూడిన బలవర్ధక ఆహారం అందుతుందన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ తెలుగు, ఉర్దూ, ఆంగ్లంలో మాట్లాడడం ఎవరికీ సాధ్యం కాదని.. మైనార్టీ గురుకులాల్లో చదివే బాలికలకే సాధ్యమని పేర్కొని, వారిని అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు వీలుగా ప్రభుత్వం కామన్ డైట్ ప్లాన్‌ను ప్రారంభించిందన్నారు. అనంతరం విద్యార్థినీవిద్యార్థులతో కలిసి స్పీకర్, కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, ఆర్డీవో వాసుచంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ ఫాతిమా , వైస్ చైర్ పర్సన్ శంషాదాబేగం, కౌన్సిలర్లు , ప్రజాప్రతినిదులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

పూలే బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లోకేశ్‌కుమార్

సాంఘిక సంక్షేమ గురుకుల వసతి గృహంలో మాట్లాడుతున్న మహేశ్ దత్

యాచారం : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మహేశ్ దత్ ఎక్కా పేర్కొన్నారు. డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం వారు వేర్వేరుగా వసతి గృహాలను సందర్శించారు. యాచారం సమీపంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ బాలికల వసతిగృహంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, నక్కగుట్టతండా సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర వసతిగృహంలో సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మహేశ్‌దత్ ఎక్కాలు డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని స్థానిక అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి సంధ్యా రాణి, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, సీఐ నరసింహ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్లపటేల్‌గూడ బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న నవీన్ మిట్టల్

నల్లకుంట బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే రంగారెడ్డి, సీనియర్ ఐఏఎస్ శశాంక్‌గోయల్

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి..

ఇబ్రహీంపట్నం రూరల్ : సంక్షేమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని నల్లకుంట రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే రంగారెడ్డితోపాటు ప్రిన్సిపల్ సెక్రటరీ శశాంక్ గోయల్ పర్యటించారు. అలాగే, చర్లపటేల్‌గూడ సమీపంలోని బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్‌మిట్టల్, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో హైదరాబాద్ డీసీపీ వెంకటేశ్వర్లు పర్యటించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ సునీతారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ప్రవంతి, మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయురాళ్లు శ్రీలత, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కామన్ డైట్ మెనూ ప్రారంభం

విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

తుర్కయాంజాల్ : విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కామన్ డైట్ మెనును ప్రవేశపెట్టిందని రంగారెడ్డి డీఎంహెచ్ వో వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని బాలికల మెనార్టీ గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనును ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో వెంకటమ్మ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ అయిలయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు గర్వించేలా ఎదగాలి

తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సునీతామోహన్

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సునీతామోహన్

కడ్తాల్ : విద్యార్థులు గొప్ప లక్ష్యాన్ని ఎంచుకుని తల్లిదండ్రులు గర్వించేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సునీతామోహన్ అన్నారు. శనివారం మండలంలోని మైసిగండి గ్రామంలో ఉన్న బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో డైట్ చార్జీల పెంపు, కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణతో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి వెంకటయ్య, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, డీటీ ఆదిత్య, ఆర్ఐ వాహిద్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు

గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో.. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబర్ 14 : గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో సోమవారం వికారాబాద్ జిల్లాలో జరుగనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులందరూ పరీక్షల విధులకు హాజరు కానున్నారని.. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించి ఎవరూ ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని ఆయన సూచించారు.

సీఎంను కలిసేందుకు

స్నేహితుడి విఫల యత్నం

- అడ్డుకున్న భద్రతాసిబ్బంది
- కలిసే అవకాశం ఎప్పుడు వస్తుందో.. ప్రకాశ్ శెట్టి

ప్రకాశ్ శెట్టి (లెక్చరర్)

మొయినాబాద్, డిసెంబర్ 14 : సీఎం రేవంత్‌రెడ్డిని చిన్ననాటి స్నేహితుడు కలిసే ప్రయత్నం చేయగా ముఖ్యమంత్రి వ్యక్తిగత భద్రతా సిబ్బంది కలువనివ్వకపోవడంతో ఒకింత ఆవేదన చెందాడు. సీఎం రేవంత్‌రెడ్డి, వనపర్తికి చెందిన ప్రకాశ్ శెట్టి వనపర్తిలోని జడ్పీహెచ్ఎస్‌లో ఇరువురు (1981 నుంచి 1984 వరకు) ఎనిమిది నుంచి పదోతరగతి వరకు కలిసి చదువుకున్నారు. మంచి స్నేహితులు. కాగా టెన్త్ పూర్తి కాగానే ఎవరి దారిన వారు వెళ్లారు. ప్రకాశ్ ఉన్నత విద్యాభ్యాసం చేసి ప్రభుత్వ అధ్యాపకుడిగా స్థిరపడ్డాడు. అతడు ప్రస్తుతం మండలంలోని చిలుకూరు గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/ఇంటర్ కళాశాలలో పని చేస్తున్నాడు. కాగా శనివారం తమ కళాశాలలో జరిగిన కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో అతడు చాలా సంతోషపడి.. స్నేహితుడిని కలిసి మాట్లాడాలనుకున్నాడు. భోజనం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పాఠశాలకు వెళ్తుండగా ప్రకాశ్ కలిసే ప్రయత్నం చేయగా ముఖ్యమంత్రి వ్యక్తిగత భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు.. కారు వద్దకు వచ్చిన తర్వాత కలవండని అక్కడి నుంచి పంపించారు. భద్రతా సిబ్బంది అలా అనడంతో ప్రకాశ్ ఒకింత ఆవేదన చెందాడు. రేవంత్‌రెడ్డి పాఠశాల నుంచి బయటకొచ్చి కారులో ఎక్కే సమయంలో కలిసేందుకు వెళ్లగా చుట్టు పక్కల ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు ఉండడంతో సాధ్యం కాలేదు. తన చిన్ననాటి స్నేహితుడు, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసే అవకాశం మళ్లీ ఎప్పుడు వస్తుందోనని మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఉల్లాసంగా రాక్‌బే నేచర్ క్యాంప్

సిటీబ్యూరో, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చిలుకూరు రిజర్వ్ ఫారెస్ట్‌లోని మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో రెండురోజుల పాటు జరిగిన రాక్‌బే నేచర్ క్యాంప్ విద్యార్థినీవిద్యార్థులకు మధురానుభూతిని మిగిల్చింది. శుక్రవారం మధ్యాహ్నం మొదలైన క్యాంప్ శనివారం సాయంత్రం వరకు జరిగింది. డెక్కన్ ఉడ్ అండ్ ట్రైల్స్ పేరిట జరిగిన ఈ క్యాంప్‌లో మంచిర్యాల జిల్లా నస్పూర్ రేడియంట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎకోటూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ మాట్లాడుతూ.. ప్రకృతితో మమేకమయ్యేలా, ప్రకృతి ప్రాధాన్యాన్ని తెలిపేలా ఈ క్యాంప్‌ను నిర్వహించామన్నారు. క్యాంప్‌లో ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ, ఎఫ్ఆర్‌వో లక్ష్మారెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్, హెడ్ నేచురలిస్ట్ అఖిల్, అపరంజిని, వండరింగ్‌బీ హాలీడేస్ తరపున రాఘవేంద్రప్రసాద్, సతీశ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు పంచాయతీ కార్మికులు పేర్కొన్నారు. శనివారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్‌కు వారు మండల కేంద్రంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జీవో నం 60 ప్రకారం వేతనాలను కేటగిరీల వారీగా చెల్లించాలని.. జీవో నం.51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, చందూ నాయక్, యూనియన్ నాయకులు శంకరయ్య, శరణం, ప్రవీణ్, జంగయ్య తదితరులున్నారు. -యాచారం, డిసెంబర్ 14

దేశ రక్షణే.. అంతిమ లక్ష్యం కావాలి

ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : దేశ రక్షణ విభాగాన్ని ఎంచుకునే యువతకు అంతిమ లక్ష్యం దేశ భద్రతే కావాలని ఎయిర్ చీఫ్ మార్షల్, చీఫ్ ఆఫ్ ది ఎయిర్‌స్టాఫ్ ఏపీ సింగ్ చెప్పారు. దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ (సీజీపీ) శనివారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన.. యుద్ధ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్ శక్తిని వివరించారు. పోరాట పటిమను కొనసాగించడంతోనే కెరీర్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంటామన్నారు. తోటి అధికారులతో సమన్వయం, జట్టుగా కృషి చేయడం, అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేయడాన్ని అలవర్చుకోవాలని వాయు, నౌకాదళాల ఆఫీసర్స్‌కు పిలుపునిచ్చారు. అంతకుముందు క్యాడెట్ల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం గ్రాడ్యుయేట్ ఫ్లయింగ్ క్యాడెట్‌లకు రాష్ట్రపతి కమిషన్‌ను ప్రదానం చేశారు. శనివారం మొత్తం 204 మంది క్యాడెట్‌లు గ్రాడ్యుయేషన్‌ను పూర్తి చేశారు. వీరిలో 178 మంది పురుషులు, 26 మంది మహిళలు ఉన్నారు. భారత నౌకాదళానికి చెందిన 9 మంది అధికారులు, భారత తీర రక్షక దళానికి చెందిన 9 మంది అధికారులు, ఒక విదేశీ అధికారికి 'వింగ్స్'ను ప్రదానం చేశారు. పైలట్ల కోర్సులో మెరిట్ సాధించి మొదటి స్థానంలో నిలిచిన ఫ్లయింగ్ ఆఫీసర్ పరాగ్ ధంకర్‌కు ప్రతిష్టాత్మక 'ప్రెసిడెంట్స్ ప్లేక్ మరియు చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ స్వోర్డ్ ఆఫ్ హానర్' లభించింది. గ్రౌండ్ డ్యూటీ బ్రాంచ్‌లో మెరిట్ సాధించిన ఫ్లయింగ్ ఆఫీసర్ రామ్ ప్రసాద్ గుర్జార్‌కు ప్రెసిడెంట్స్ ప్లేక్ లభించింది. పరేడ్ అనంతరం పీసీ-7 ఎంకే-II, ఎస్‌యూ-30 ఎంకేఐ వంటి యుద్ధ విమానాలు, సారంగ్ హెలికాప్టర్లు, సూర్య కిరణ్ ఏరోబాటిక్ టీమ్‌ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎయిర్ మార్షల్ శ్రీనివాసులు, ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్, పలువురు సీనియర్ ఫ్లయింగ్ ఆఫీసర్లు, క్యాడెట్ల కుటుంబీకులు పాల్గొన్నారు.

ఏసీఎఫ్ 50 వసంతాల సభ

చిక్కడపల్లి, డిసెంబర్14 : సామ్రాజ్యవాద యుద్ధ సంస్కృతిపై ఐక్య ఉద్యమాలు చేయాలని పలువురు వక్తలు అన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఏసీఎఫ్) 50 వసంతాల బహిరంగ సభను శనివారం బాగ్‌లింగంపల్లి వీఎస్‌టీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ జ్ఞాన అలోషియస్ మాట్లాడుతూ గ్రామల్లో యువతలో మతతత్వం రోజురోజుకు పెరిగిపోతుందని అన్నారు. మంచి మార్గంలో సమాజం ముందుకు సాగేటట్టు కళాకారులు చొరవ చూపాలన్నారు. అరుణోదయ ఉభయ రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు విమలక్క అధ్యక్షత జరిగిన సభలో సీనియర్ సంపాదకులు శ్రీనివాస్, ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావు, ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, కట్ట భగవంత రెడ్డి, ప్రొఫెసర్ కొల్లాపురం విమల,మనోజ, తెలంగాణ ఏపీ రైతు కూలీ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు కర్నాకులా వీరాంజనేయులు, పటోళ్ల నాగిరెడ్డి, పీవోడబ్ల్యూ, సుజ్ఞానమ్మ, అరుణ, అల్లూరి విజయ్ పీడీఎస్‌యూ సతీశ్, తెలంగాణ కార్యదర్శి మల్సూర్, ఏపీ అధ్యక్షుడు బోయ సుంకులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి పశువైద్య జాతీయ సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 14: మూడు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సులో పశువైద్యంపై సుదీర్ఘ చర్చ జరుగనున్నదని, పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.శరత్ చంద్ర అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వెటర్నరీ సమావేశపు హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17 నుంచి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. 33వ నేషనల్ కాంగ్రెస్ నేషనల్ సింపోజియం ఆఫ్ పారాసిటాలజీ అనే అంశంపై సుదీర్ఘ చర్చ జరుగనున్నదన్నారు. జంతు, పరాన్నజీవుల నియంత్రణ, ప్యూహాలలో చేసిన మార్పులు, నూతన ఆవిష్కరణలు పెద్ద ఎత్తున జరగనున్నాయన్నారు. అసోసియేట్ డీన్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ వెటర్నరీ నిపుణులు, డాక్టర్ల మధ్య సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఈ సదస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డా.సత్యనారాయణ రాజు,డా.సురేశ్, విజయ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.